సాక్షి ఖమ్మం

శుక్రవారం । 5 । మే । 2023



మిడ్‌వైఫరీ సేవలు విస్తరణ

సాధారణ కాన్పులే లక్ష్యంగా మిడ్ వైఫరీ సేవలను విస్తృతంగా అమలుచేస్తుండడంతో సత్ఫలితాలు వస్తున్నాయి. 8లో



రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలం

రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదవుతాయి. ఎండప్రభావం కూడా పెద్దగా ఉండదు.

న్యూస్‌రీల్

నేటి నుంచి రైఫిల్ షూటింగ్, చెస్ శిక్షణ

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం నుంచి రైఫిల్ షూటింగ్, చెస్ క్రీడాంశాల్లో వేసవి శిక్షణ శిబిరం మొదలుకానుంది. చెస్ శిక్షణ ఉదయం 10నుంచి ఒంటి గంట వరకు, రైఫిల్ షూటింగ్ శిక్షణ సాయంత్రం 5నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వివరాల కోసం 96187 18929 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉచిత శిక్షణకు 21న ప్రవేశపరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఇచ్చే ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణ కోసం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈనెల 21న ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ సెక్రటరీ, ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో పరీక్ష ఉంటుందని, ప్రతిభ చూపిన వంద మందిని ఎంపిక చేసి ఉచిత భోజన, వసతితో రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలతో పాటు బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్సెస్సీ పరీక్షలకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 14వ తేదీ వరకు టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఏబీసీలో సేవలు విస్తృతం చేయండి



సెంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సత్తుపల్లిటౌన్: వీధి కుక్కల సంతానాన్ని కట్టడి చేసేందుకు సత్తుపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన ఏనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)లో సేవలు మరింత విస్తృతం చేయాలని అదనపు కలెక్టర్ స్నేహలత ఆదేశించారు. పట్టణంలోని సెంటర్‌ను గురువారం పరిశీలించిన ఆమె మాట్లాడుతూ తొలిదశలో మున్సిపాలిటీ పరిధిలోని వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని, ఆతర్వాత గ్రామపంచాయతీల్లోనూ అమలుచేయాలని తెలిపారు. అనంతరం ఆమె కాకర్లపల్లి రోడ్డులోని వెంచర్, మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని ఆమె పరిశీలించారు. కాగా, అటవీశాఖ కార్పొరేషన్ ప్రాంగణంలోని భారీ చెట్ల కొమ్మలు తీగలపై పడి విద్యుత్ సరఫరాకు ఆటంకం ఎదురవుతోందని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ తెలపగా ఆ శాఖ అధికారులతో మాట్లాడతామని అదనపు కలెక్టర్ చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణి, డీటీసీపీఓ ప్రసాద్, టీపీఓ శ్రీనివాస్ ఉన్నారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి రేపు పరీక్ష

ఏన్కూరు: తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాల(టీఎస్‌ఆర్‌జేసీ)ల్లో ప్రవేశానికి ఈనెల 6న పరీక్ష నిర్వహిస్తున్నట్లు పరీక్షల కోఆర్డినేటర్ టి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 5,297మంది దరఖాస్తు చేసుకోగా, జిల్లాలో 22 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రవేశపరీక్ష ఉదయం 10నుండి మధ్యాహ్నం 12–30 గంటల వరకు జరుగుతుందని ఆయన తెలిపారు. కాగా, ప్రశ్నాపత్రాల లీకేజీ, ఇతర అంశాలపై వదంతులకు విద్యార్థులు, తల్లిదండ్రులు దూరంగా ఉండడంతో పాటు ఇలాంటి ప్రచారం జరుగుతున్నట్లు తెలిస్తే కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కోఆర్డినేటర్ కోరారు.

కార్మికుల కూలీ రేట్లు 13శాతం పెంపు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసే కార్మికుల కూలీ రేట్లు 13 శాతం పెరిగాయి. నిబంధనల ప్రకారం చార్జీలు పెంచాలని కార్మికులు మార్కెట్ కమిటీకి నోటీసులు ఇచ్చారు. దీంతో పలు దఫాలుగా హమాలీలు, దడవాయిలు, ఇతర విభాగాల కార్మిక విభాగాల వర్గాలతో మార్కెట్ కమిటీ బాధ్యులు చర్చించారు. చివరకు గురువారం రాత్రి అదనపు కలెక్టర్ ఎన్ మధుసూదన్ సమక్షాన కలెక్టరేట్‌లో మార్కెట్ కమిటీ బాధ్యులు, వివిధ శాఖల అధికారులు, కార్మిక, వ్యాపార ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ మేరకు 13 శాతం రేట్లు పెంచుతున్నట్లు ప్రకటించగా అంతా అంగీకరించారు. ఈ చర్చల్లో ఖమ్మం మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.నాగరాజు, వివిధ శాఖల అధికారులు, వ్యాపార ప్రతినిధులు సోములు, రాజేందర్, ఎడ్లపల్లి సతీష్, ముత్యం ఉప్పల్‌రావు పాల్గొన్నారు.

పొంగులేటి చూపు.. ఎటువైపు?!



చర్చల అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి, పక్కన జూపల్లి, కోరం కనకయ్య తదితరులు

ఏ పార్టీలో చేరతారనే అంశంపై ఉత్కంఠ

- ఇప్పటికే చర్చలు జరిపిన కాంగ్రెస్ నేతలు
- తాజాగా బీజేపీ బృందం రాకతో జోరందుకున్న చర్చలు



ఈటలతో మాట్లాడుతున్న పొంగులేటి, పక్కన జూపల్లి, విశ్వేశ్వర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏ పార్టీలో చేరుతారనేది ఉమ్మడి జిల్లాలోని ఆయన అనుచరులతోపాటు రాజకీయంగా ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ నేతలు ఆయనతో చర్చలు జరిపారు. ఈ నెలాఖరు వరకు ఏ పార్టీలో చేరే అంశం తేలనుండడంతో ఆయన నిర్ణయంపై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సహా ఆ పార్టీ ముఖ్యనేతలు ఐదుగురు గురువారం పొంగులేటిని ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. పొంగులేటితోపాటు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు వచ్చిన బీజేపీ నేతలకు పొంగులేటితోపాటు ఆయన అనుచర నేతలు స్వాగతం పలికారు. భోజనం చేశాక చర్చలు జరిపిన వారు సాయంత్రం 6.30 గంటలకు తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. ఈ మొత్తం చర్చల్లో బీజేపీలో చేరతారా, లేదా అనేది స్పష్టత రాకున్నా... పొంగులేటి నిర్ణయం ఈనెలాఖరుకు తేలే అవకాశముందని తెలుస్తోంది.

ఇప్పటికే మాట్లాడిన రేవంత్‌రెడ్డి

ఈ ఏడాది జనవరి మొదట్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్‌ఎస్ పార్టీపై తిరుగుబాటు జెండా ఎగురవేయగా, అప్పటినుంచి ఆయన ఏ పార్టీలో చేరాలనే అంశంపై అంతర్గత చర్చలు కొనసాగిస్తున్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితోపాటు ముఖ్యనేతలు పొంగులేటితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీలో చేరితే తగిన ప్రాధాన్యత ఇస్తామని చెప్పినట్లు తెలిసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆది నుంచి కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండడం, వచ్చే ఎన్నికల్లోనూ బలంగా ఉంటుందని టీపీసీసీ నేతలు ఆయనకు చెప్పినట్లు సమాచారం. పార్టీలో చేరితే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ సత్తా చాటొచ్చని ప్రతిపాదించినా.. ఆయన ఏ నిర్ణయం చెప్పలేదని తెలిసింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఆయన అనుచర నేతలు కూడా అంతర్గత సర్వేల ఆధారంగా కాంగ్రెస్ పార్టీలోనే చేరాలని కోరినట్లు సమాచారం.

బీజేపీ కమిటీ రాకతో కాక

ఈటల నేతృత్వంలోని బీజేపీ చేరికల కమిటీ నేరుగా పొంగులేటి క్యాంప్ కార్యాలయానికి వచ్చి ఆయనతోపాటు జూపల్లితో సుదీర్ఘంగా చర్చించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయాలు వేడెక్కాయి. పార్టీ అధినేతలు అమిత్‌షా, నడ్డా సూచనల మేరకే తాము పొంగులేటితో చర్చలకు వచ్చినట్లు ఈటల ప్రకటించడంతో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల తాజా రాజకీయ పరిస్థితులను ఇరువురు నేతలు ఈటల ముందు ప్రస్తావించారు. కేసీఆర్‌ను గద్దె దించే లక్ష్యం కలిగిన బలమైన శక్తులతోనే తమ ప్రయాణం ఉంటుందని వీరిద్దరు చెప్పినట్లు తెలిసింది. ఇదేసమయాన ఆయన కూడా రాష్ట్రంలో బీజేపీ బలపడుతుండడం, దేశంలో రాజకీయ పరిస్థితులను వివరించి పార్టీలో చేరాలని ఆహ్వానించారని సమాచారం. ఇదిలా ఉండగా పొంగులేటితో చర్చించిన అంశాలను ఈటల బృందం రెండు, మూడు రోజుల్లో బీజేపీ పెద్దలకు వివరించనున్నట్లు తెలిసింది. ఆ తర్వాత మరోదఫా పొంగులేటిని ఈటల రాజేందర్ కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అనుచర నేతల్లో ఉత్కంఠ

పొంగులేటిని బీజేపీ చేరికల బృందం కలవడంపై ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరగణంలో జోరుగా చర్చ సాగుతోంది. ఈటల వస్తున్నారనే సమాచారంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుచరులు ఖమ్మం క్యాంప్ ఆఫీస్‌కు తరలివచ్చారు. ఉదయం తొమ్మిది నుంచి బీజేపీ నేతలు వెళ్లాక రాత్రి తొమ్మిది గంటల వరకు పొంగులేటి క్యాంప్ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. అన్ని నియోజకవర్గాల నుంచి ముఖ్య నేతలు, ఆయన అభ్యర్థులుగా ప్రకటించిన వారు క్యాంప్ కార్యాలయానికి చేరుకోగా.. శ్రీనివాసరెడ్డి, కృష్ణారావుతో బీజేపీ బృందం ఏం చర్చిస్తుందోనని ఆసక్తిగా ఎదురుచూశారు. భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో పాటు డాక్టర్ తెల్లం వెంకట్రావు, జాలె ఆదినారాయణ, విజయాబాయి, కోటా రాంబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని బేబీ స్వర్ణకుమారి కార్యాలయానికి వచ్చిన వారిలో ఉన్నారు.

బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభోత్సవంలో మంత్రి పువ్వాడ





సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నాగేశ్వరరావు



పూజలో పాల్గొన్న ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు తదితరులు

ఢిల్లీలో గురువారం బీఆర్‌ఎస్ భవన్‌ను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజల అనంతరం వారు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. – ఖమ్మంమయూరిసెంటర్

పరిశుభ్రతే ప్రధానం..



కలుపుమొక్కలు తొలగిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్ తదితరులు

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- కలెక్టరేట్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్'

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు తమ కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లోని అధికారులు, సిబ్బందితో కలిసి కలుపు మొక్కలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ గురువారం కార్యాలయ పనివేళలు ప్రారంభానికి ముందు కలెక్టరేట్ ఆవరణ, కార్యాలయాల్లో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాలని సూచించారు. తద్వారా శ్రద్ధగా విధులు నిర్వర్తించొచ్చని తెలిపారు. అనంతరం పలు శాఖల్లో పరిశీలించిన ఆయన ఈ–ఆఫీస్ విధానం తప్పనిసరి అమలుచేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా లే ఔట్లకు అనుమతి

లే ఔట్ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాయంలో నిర్వహించిన జిల్లా స్థాయి లేఔట్ అప్రూవల్ కమిటీ సమావేశంలో 16 దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తుల పరిశీలన, అనుమతిపై సూచనలు చేశారు. ఆతర్వాత లేఔట్ రెగ్యులేషన్ స్కీం–2020పై సమీక్షించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఆర్డీఓ రవీంద్రనాథ్, డీపీఓ అప్పారావు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు శ్రీనివాసులు, శ్రీనివాస్, కె.వికాస్, ప్రసాద్, రమాదేవి, సుజాత, వెంకటేశ్వర్లు, శైలజ, సుమ, నరసింహారావు, సైదులు పాల్గొన్నారు.

ఆహార భద్రత కార్డు ఉంటే చాలు



వైద్యసేవలను పరిశీలిస్తున్న డాక్టర్ గోపి

నేలకొండపల్లి: ఆరోగ్య శ్రీ కార్డులు లేకున్నా... ఆహార భద్రత కార్డు ఉంటే సేవలు పొందొచ్చని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్.గోపి వెల్లడించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం తనిఖీ చేసిన ఆయన సేవలపై ఆరా తీశారు. ఆతర్వాత విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు లేదని బాధపడాల్సిన పసరం లేదన్నారు. ఆహార భద్రత కార్డు సాయంతో చికిత్స పొందొచ్చని, అది కూడా లేకపోతే అత్యవసర సమయాల్లో సీఎంసీఓ ద్వారానైనా ఆరోగ్యశ్రీ సేవలు అందుతాయని వివరించారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా 53 రకాలు, ఆయుష్మాన్‌భారత్ ద్వారా 1,800 రకాల వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. కాగా, ఆరోగ్యశ్రీ సేవల కోసం ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకురావాలని సూచించారు. ఎక్కడైనా ప్రైవేట్ ఆస్పత్రుల్లో సమస్య ఎదురైతే ఆరోగ్యమిత్రలకు ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాస్, నేలకొండపల్లి సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.రాజేష్, ఆరోగ్యమిత్ర కిషన్ పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణికి పదోన్నతి

- కరీంనగర్ డీడీగా పోస్టింగ్
- భద్రాద్రి జిల్లా సంక్షేమాధికారిగా సబిత



సీహెచ్.సంధ్యారాణి



ఎం.సబిత

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్.సంధ్యారాణికి డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్రంలో ఎనిమిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లకు డీడీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోలికేరి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఖమ్మం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఏడీగా 2019లో నియమితులైన ఎం.సబితను మహబూబాబాద్ జిల్లా ఏడీ, జిల్లా సంక్షేమాధికారిగా 2020లో డిప్యూటేషన్‌పై నియమించారు. అక్కడ ఉన్న సంధ్యారాణిని డిప్యూటేషన్‌పై ఖమ్మం జిల్లాకు కేటాయించారు. 2020 అక్టోబర్ 1వ తేదీ నుంచి ఖమ్మం జిల్లా సంక్షేమాధికారిగా సంధ్యారాణి పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమేరకు పదోన్నతుల జాబితాలో సంధ్యారాణి, సబితకు స్థానం దక్కగా సంధ్యారాణిని కరీంనగర్‌కు కేటాయించారు. ఇక సబితను డిప్యూటీ డైరెక్టర్ హోదాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా సంక్షేమాధికారిగా నియమించారు.

ఖమ్మంకు డీడీ స్థాయి పోస్టు లేదు..

ఖమ్మం జిల్లాకు మహిళా, శిశు సంక్షేమ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ పోస్టు మంజూరు లేదు. దీంతో అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారి సంధ్యారాణి జిల్లా సంక్షేమాధికారిగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం పలువురికి డీడీలుగా ఉద్యోగోన్నతి కల్పించి జిల్లాల సంక్షేమాధికారులుగా నియమించినా, ఖమ్మంలో ఏడీ స్థాయి అధికారిని కూడా నియమించలేదు. దీంతో సంధ్యారాణిని రిలీవ్ చేస్తారా లేదా ఆమెనే ఇన్‌చార్జ్‌గా నియమిస్తారా, ఇంకో ఏడీ స్థాయి అధికారిని కేటాయిస్తారా అనేది తేలాల్సి ఉంది. కాగా, ఖమ్మం జిల్లా సంక్షేమాధికారిగా వచ్చేందుకు పలువురు ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

దళితవాడల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం



కూసుమంచి : జీళ్లచెరువు సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఖమ్మంరూరల్: దళితవాడల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన కేవీపీఎస్ విస్తృతస్థాయి సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను కేంద్రం వేరే పథకాలకు మళ్లిస్తోందని ఆరోపించారు. అంతేకాక బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేస్తూ రాజ్యాంగాన్ని బలహీనపరచాలని చూస్తోందని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దళితులందరూ ఐక్యంగా ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కాగా, పాలేరులో ఖాళీ స్థలాలు ఆక్రమించుకున్న ప్రతీ దళిత కుటుంబానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని, దళితవాడల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, దళితబంధు పథకాన్ని ప్రతీ కుటుంబానికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, అధ్యక్షుడు ముత్తమాల ప్రసాద్‌తో పాటు బండి రమేష్, పి.సత్యనారాయణ, కొమ్ము శ్రీను, బి.రమేష్, కె.సైదులు, పి.ఉపేందర్, బీ.ఎస్.కృష్ణ, వరకుమార్, నాగాటి సురేష్, పల్లి రమేష్, బాబు, మైకు బాబు, పగిడికత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను విస్మరిస్తున్న కేంద్రం

కూసుమంచి/నేలకొండపల్లి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతోందని.. ఈక్రమంలో బీజేపీ గద్దె దించేందుకు చేస్తున్న పోరాటంలో అందరూ కలిసి రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. కూసుమంచి మండలం జీళ్లచెరువు, నేలకొండపల్లి మండలం మోటాపురంలో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను రద్దు చేసేందుకు కుట్ర పన్నిన బీజేపీపై గర్జించాలన్నారు. నాయకులు జానకీరాములు, పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమేష్, గుడవర్తి నాగేశ్వరరావు, ఎడవెల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, సన్మంతరావు, రాజు, వెంకటేశ్వర్లు, కే.వీ.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, పగిడికత్తుల నాగేశ్వరరావు, ఇంటూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఆటకు సిద్ధం!

రేపు లాన్ టెన్నిస్ కోర్టు ప్రారంభం

జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటుచేసిన మూడు లాన్ టెన్నిస్ కోర్టులను రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ప్రారంభించనున్నారు. దాదాపు రూ.93 లక్షల వ్యయంతో నిర్మించిన లాన్ టెన్నిస్ కోర్టులకు ప్రత్యేక గ్యాలరీ, లైటింగ్ ఏర్పాటుచేశారు. ఈ కోర్టులను శనివారం సాయంత్రం మంత్రి ప్రారంభించనుండగా, క్రీడాకారులకు అందుబాటులోకి రానున్నాయి. – ఖమ్మం స్పోర్ట్స్

క్లుప్తంగా

జాతీయ స్కేటింగ్ పోటీల్లో సత్తా



క్రీడాకారులతో కోచ్, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: పంజాబ్ రాష్ట్రం మొహాలీలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో ఖమ్మం క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పి.రాధ్య, ఎల్.గౌతమ్, ఎస్.కే.సమ్రీన్, కె.గణేష్, డి.కార్తికేయ, వై.జైత్రేష్, ఎ.శ్రావణ్‌కుమార్, ఎం.శ్రేయస్, ఐ.శ్యూహిత, పి.హర్షిత్ నాగ వెంకట్, జి.లావణ్య వివిధ కేటగిరీల్లో పతకాలు సాధించారు. వీరిని డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్ కె.సురేష్ గురువారం అభినందించారు.

ముగిసిన ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజుకు ఇద్దరు అభ్యర్థులకు గాను ఇద్దరు హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ పాపారావు తెలిపారు. కాగా, ఈనెల 2వ తేదీన రద్దయిన ఇంటర్మీడియట్ ఎకనామిక్స్ తెలుగు మీడియం పరీక్షను 13వ తేదీన ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు.

వైరా రిజర్వాయర్‌లో జూన్ 5 నుంచి చేపల వేట

వైరా: వైరాలోని రిజర్వాయర్‌లో వచ్చేనెల 5 తేదీ నుంచి చేపల వేట ప్రారంభించనున్నట్లు వైరా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు షేక్ రహీం తెలిపారు. గురువారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత ఈనెల 18నుంచి చేపలు పట్టాలని భావించినా, అకాలవర్షాలతో జూన్ 5కు వాయిదా వేసినట్లు తెలిపారు. జూన్ ఆరంభంలోనే మృగశిర కార్తె ఉన్నందున చేపలకు డిమాండ్ ఉంటుందనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

7న ఏకలవ్య పాఠశాలల ప్రవేశపరీక్ష

కొణిజర్ల: ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి ఈనెల 7న పరీక్ష నిర్వహించనున్నట్లు కారేపల్లి ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ సత్యానంద్ తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఉద యం 10:30నుంచి మధ్యాహం ఒంటి గంట వరకు, 7, 8వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి మధ్యాహ్నం రెండు నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. కొణిజర్ల మండలం తనికెళ్లలోని లక్ష్య కళాశాల ఎంబీఏ బ్లాక్, రఘునాథపాలెం ఎస్‌ఓఈల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య



షేక్ జిలానీ (ఫైల్)

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపాన గురువారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధిర రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణు గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన షేక్ జిలానీ(77) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయి. దీంతో ఎర్రుపాలెం రైల్వే గేట్ వద్ద డౌన్‌లైన్‌లో విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

ఐసీడీఎస్‌లో పది స్మార్ట్ ఫోన్లు చోరీ

ఖమ్మంగాంధీచౌక్: మహిళా, శిశు సంక్షేమ శాఖకు చెందిన పది ట్యాబ్‌లు ఫోన్లు మాయమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణను ఆన్‌లైన్ చేయడంలో భాగంగా కేంద్రాల నిర్వాహకులకు మహిళా, శిశు సంక్షేమ శాఖ స్మార్ట్‌ఫోన్లను ఏడాది క్రితం ఇచ్చింది. ఖమ్మం గట్టయ్యసెంటర్‌లోని ఖమ్మం రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి 280 స్మార్ట్‌ఫోన్లు కేటాయించగా, ఇందులో 270 ఫోన్లను టీచర్లకు పంపిణీ చేశారు. మిగిలిన పదింటిని కార్యాలయంలోనే భద్రపర్చగా, ఇటీవల పరిశీలించే సమయాన చోరీ జరిగినట్లు ప్రాజెక్టు అధికారి సరస్వతి గుర్తించారు. వీటి విలువ రూ.లక్ష మేరకు ఉంటుందని తెలుస్తుండగా ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్ అధికారుల సూచనలతో ఆయా ఫోన్ల ఈఎంఐఈ నంబర్లు సేకరిస్తున్నారు. కాగా, కార్యాలయ బీరువాలో ఫోన్లు చోరీ కావడం వెనుక ఇంటి దొంగలే కారణమనే ప్రచారం జరుగుతోంది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,106	4,500
కందులు	7,800	7,800
మినుములు	6,930	6,500
మిర్చి	23,000	19,500
మిర్చి తాలు	12,000	8,000
పత్తి	7,400	5,000

– ఖమ్మం వ్యవసాయం

మిడ్‌వైఫరీ సేవలు విస్తరణ

- సాధారణ కాన్పులే లక్ష్యంగా నిర్వహణ
- అమల్లోకి ఆధునిక 'బర్త్ కంపానియన్' పద్ధతి
- నేడు అంతర్జాతీయ మిడ్‌వైఫ్స్ దినోత్సవం

మాతాశిశు మరణాలను అరికట్టడం, సాధారణ కాన్పులను పెంచటమే లక్ష్యంగా విదేశీ పరిజ్ఞానంతో మిడ్‌వైఫరీ సేవలను రాష్ట్రప్రభుత్వం కొన్నాళ్ల క్రితం ప్రవేశపెట్టింది. ఆతర్వాత క్రమంగా జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులకు విస్తరించింది. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి. శుక్రవారం అంతర్జాతీయ మిడ్‌వైఫ్స్ దినోత్సవం సందర్భంగా కథనం. – సత్తుపల్లిటౌన్



గర్భిణులకు శిక్షణ ఇస్తున్న మిడ్‌వైఫ్స్

సిజేరియన్లకు అడ్డుకట్ట

సిజేరియన్ ప్రసవాలకు అడ్డుకట్ట వేయడం, సాధారణ కాన్పులను ప్రోత్సహించడంతో పాటు మాతాశిశు మరణాలను తగ్గించడంపై వైద్య, ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. ఈమేరకు ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే నర్సులకు యునిసెఫ్ తోడ్పాటుతో హైదరాబాద్‌లోనిఫెర్నాండెజ్ ఫౌండేషన్‌లో 18 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. వీరు జిల్లా ఆస్పత్రితో పాటు ఇతర ఆస్పత్రుల్లో గర్భధారణ జరిగినప్పటి నుంచి మహిళకు అవసరమైన వైద్యసాయం అందిస్తూనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. సాధారణ కాన్పు కోసం ఆసనాలు, బర్త్ కంపానియన్ పద్ధతి(కుటుంబీకుల సమక్షాన ప్రసవం చేయడం), నవజాతి శిశువులకు సేవలు, హైరిస్క్ గర్భిణులను గుర్తించి సేవలందించటం తదితర అంశాల్లో మిడ్‌వైఫరీ నర్సులు సేవలంస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, సత్తుపల్లి, మణుగూరు ప్రభుత్వాస్పత్రుల్లో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

కుటుంబ సభ్యుల సమక్షంలో పురుడు

ప్రసవ సమయంలో గర్భిణీ కుటుంబ సభ్యులను పురిటి గదిలోకి అనుమతించే విధానం(బర్త్ కంపానియన్) విదేశాల్లో ఎప్పటి నుంచో అమలవుతోంది. ప్రస్తుతం ప్రత్యేక శిక్షణ పొందిన మిడ్‌వైఫరీ నర్సులు ఈ పద్ధతిని అమలు చేస్తుండటంతో సత్ఫలితాలొస్తున్నాయి. దీనివల్ల ప్రసవ సమయంలో గర్భిణులు ఒత్తిడి, భయం, ఆందోళన నుంచి ఉపశమనం పొంది ఆక్సీటోసిన్ హార్మోన్ విడుదలై సుఖప్రసవమవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. గర్భిణులకు ఇష్టమైన భర్త, తల్లి తదితర ఎవరిని కోరుకున్నా వారిని గదిలోకి అనుమతిస్తూ సాధారణ కాన్పులు జరిగేలా కృషి చేస్తున్నారు.

రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలం

- సీఎం ప్రకటించిన పరిహారమే రాలేదు...
- కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి



ముదిగొండ: చిరుమర్రిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న అన్వేష్‌రెడ్డి, నాయకులు

మధిర/బోనకల్/చింతకాని/ఎర్రుపాలెం/ముదిగొండ: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలమైన ప్రభుత్వం.. మిగిలిన పంటలను అమ్ముకుందామనుకుంటే కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటుచేయడం లేదని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకట అన్వేష్‌రెడ్డి విమర్శించారు. మధిర మండలం సిరిపురం, బోనకల్ మండలం ఆళ్లపాడు, రాయన్నపేట, చింతకాని మండలం పొద్దుటూరు, మత్కేపల్లి, ముదిగొండ మండలం చిరుమర్రి, వల్లాపురం, ఎర్రుపాలెం మండలం లక్ష్మీపురం గ్రామాల్లో ఇటీవల వర్షాలతో దెబ్బతిన్న పంటలను ఆయన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని తదితరులలో కలిసి గురువారం పరిశీలించారు. ఆతర్వాత నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అన్వేష్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత నెలలో వచ్చిన వడగండ్ల వానతో జిల్లాలో మొక్కజొన్న రైతులు నష్టపోతే పరిశీలించి పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినా ఇప్పటివరకు నిధులు జమ కాలేదని తెలిపారు. దీనికి తోడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయకపోవడంతో దళారులు తక్కువ ధరకే దోచుకుంటున్నారని ఆరోపించారు. అలాగే, వరి సాగు చేసిన రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారిందని అన్వేష్‌రెడ్డి వాపోయారు. కాంటాలు, తరలింపు సకాలంలో జరగకపోవడంతో అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఇకనైనా పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడమే కాక ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టాలని ఆయన డిమాండ చేశారు. కాగా, చింతకాని మండలం లచ్చగూడెంలో పంట నష్టపోగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌలు రైతు చెక్కల లక్ష్మయ్యను అన్వేష్‌రెడ్డి, నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు వడ్డే నారాయణరావు, ముదునూరి మధుసూదన్‌రెడ్డి, దాసరి డానియల్, దుంపా వెంకటేశ్వరరెడ్డి, సూరంశెట్టి కిషోర్, దారా బాలరాజు, అద్దంకి రవికుమార్, కర్నాటి రామారావు, ఐలూరి సత్యనారాయణరెడ్డి బందం నాగేశ్వరావు, గాలి దుర్గారావు, కర్నాటి రామకోటేశ్వరావు, పిల్లలమర్రి నాగేశ్వరావు, కందుల పాపారావు, శాస్త్రి, పాసంగుల పాటి, కోటేశ్వరావు, సుబ్బారావు, అంతోని వెంకటేశ్వర్లు, కొమ్మినేని రమేష్‌బాబు, కందిమళ్ల వీరబాబు, పసుపులేటి దేవేంద్రం, ఇలవల పుల్లారెడ్డి, పందిరి అంజయ్య, ఇలవల వీరారెడ్డి, మల్లెల అజయ్, అజ్గర్, కోయ చిన్నధనమూర్తి, వినోద్, వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై ఏసీపీ విచారణ

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంలో ఓ వివాహిత మృతికి సంబంధించిన కేసును ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి గురువారం విచారించారు. కోరట్లగూడెంకు చెందిన నవ్య ఏప్రిల్‌లో మృతి చెందగా, భర్త, కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధించడంతో ఆమె మృతి చెందిందని తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఏసీపీ బస్వారెడ్డి ఆమె కుటుంబ సభ్యులు, స్థానికులను విచారించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మృతదేహాన్ని దహనం చేసిన ప్రదేశంలో అస్థికలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఎంపీడీఓ కె.జమలారెడ్డి, ఎస్సై జి.స్రవంతి పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దివారిగూడెం శివారు వ్యవసాయభూమిలో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం గురువారం లభ్యమైంది. గ్రామానికి చెందిన నర్రా గోపి గొర్రెలను మేపడానికి మున్నేరు వైపు వెళ్తుండగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించాడు. ఆయన ఇచ్చిన సమాచారంతో పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

తల్లంపాడులో చోరీ

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడులో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మునగంటి వేణు కుటుంబీకులు బుధవారం రాత్రి ఆరుబయట పడుకున్నారు. గురువారం తెల్లవారు జామున లేచిచూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి లోపలబీరువా తాళాలు కూడా తీసి ఉన్నాయి. దీంతో పరిశీలంచగా రూ.65వేల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

పెనుబల్లి: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడు గేదెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. వివరాలు... ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన ఆకుల మురళీకృష్ణ(70) హైదరాబాద్ ఆస్పత్రికి బస్సులో వెళ్లేందుకు వీఎం బంజర బస్టాండ్‌కు తన ద్విచక్రవాహనంపై గురువారం తెల్లవారుజామున బయలుదేరాడు. మార్గమధ్యలో పెనుబల్లి మండలం ముత్తగూడెం-కారాయిగూడెం క్రాస్ వద్ద జాతీయ రహదారిపై గేదెను ఢీకొట్టాడు. గేదె కొమ్ములు ఆయన ముఖానికి తాకడంతో తీవ్రం గాయపడగా స్థానికులు మురళీకృష్ణను పెనుబల్లి ఆస్పత్రికి, ఆపై విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం ఆయన మృతి చెందాడని ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు.

విదేశీ యూనివర్సిటీల్లో గిరిజన విద్యార్థులకు సీట్లు

అక్కడకు వెళ్లే స్థోమత లేక దాతల చేయూతకు వినతి



క్రాంతినాయక్



సిద్ధు



అలెగ్జాండర్

పాల్వంచరూరల్: ఇంటర్ పూర్తిచేసిన ముగ్గురు గిరిజన విద్యార్థులకు అమెరికాలో ఉన్నత చదువుల కోసం సీట్లు లభించాయి. కానీ అక్కడికి వెళ్లే స్థోమత లేక వారు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. పాల్వంచ మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరుకు గుగులోతు క్రాంతినాయక్, కొణిజర్ల మండలం చిన్నమునగాలకు చెందిన కాంపెల్లి సిద్ధు, సత్తుపలికి అంబేద్కర్ నగర్‌కు చెందిన సిద్దార్థ అలెగ్జాండర్ తాజాగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేశారు. వీరు శాట్స్ పరీక్ష రాయగా అమెరికాలోకి వివిధ యూనివర్సిటీల్లో సీఎస్ఈ కోర్సు చదివేందుకు సీట్లు లభించాయి. కానీ అక్కడి వెళ్లి చదువుకోవాలంటే ఒక్కో విద్యార్థికి రూ.25లక్షలపైగానే ఖర్చవుతుంది. దీంతో అంత స్థోమత లేని వారు ప్రభుత్వం, దాతలు చేయూత కోసం ఎదురుచూస్తున్నారు. కాగా, దాతలు సహకరిస్తే గిరిజన విద్యార్థులు విదేశాల్లో చదువుకునే అవకాశం లభిస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలోనే నీలమ్మ మృతి

- గాయపడిన మహిళను ఆస్పత్రిలో చేర్పించిన ఆటో డ్రైవర్
- సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా కేసు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీపీ విష్ణు ఎస్.వారియర్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ విష్ణు ఎస్.వారియర్



పోలీసులు విడుదల చేసిన సీసీ టీవీ ఫుటేజీ

ఖమ్మంక్రైం: మహిళను కిడ్నాప్ చేసి ఆపై హత్య చేసినట్లు ప్రచారం జరగడంతో జిల్లాలో సంచలనం సృష్టించగా... సదరు మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతోనే మృతి చెందిందని పోలీసులు తేల్చారు. ఈమేరకు వివరాలను పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ గురువారం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం రామన్నకుంట తండాకు చెందిన బానోతు నీలమ్మ(45) మృతిపై ఆమె బంధువు బానోతు బాలాజీ ఈనెల 2న ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొలుత ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్, హత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈమేరకు కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయగా ఆమె మృతికి రోడ్డుప్రమాదమే కారణమని తేలింది.

ఫిర్యాదు ఇలా...

వైద్యచికిత్స కోసం బానోతు నీలమ్మ అత్త బానోతు మల్లమ్మతో కలిసి గతనెల 27న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఖమ్మంకు వచ్చింది. అక్కడి నుంచి ఆటోలో మమత ఆస్పత్రికి వెళ్తుండగా.. మల్లమ్మ మూత్రవిసర్జన కోసం ఆటో దిగింది. దీంతో ఆటో డ్రైవర్ నీలమ్మను తీసుకుని వెళ్లిపోయాడు. అనంతరం మల్లమ్మ స్వస్థలానికి వెళ్లి బంధువులకు చెప్పగా వారు ఖమ్మం చేరుకుని గాలించినా ఫలితం లేదని చెబుతూ ఈనెల 2న సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆతర్వాత మార్చురీలో భద్రపరచిన గుర్తుతెలియని మహిళ మృతదేహం ఫొటోలను బంధువులకు చూపించగా వారు నీలమ్మదేనని గుర్తించాడు. గతనెల 28న ఉదయం 10గంటలకు గుర్తు తెలియని వ్యక్తి నీలమ్మను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడని సిబ్బంది ద్వారా తెలుసుకున్న బంధువులు ఆమెను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి.. హత్య చేసి ఉంటారనే భావనకు వచ్చారు. దీంతో పోలీసులు కేసు నమోదు మిస్టరీని ఛేదించేందుకు మూడు బృందాలతో దర్యాప్తు చేపట్టారు.

అసలు జరిగింది ఇదీ...

శవపరీక్ష సందర్భంగా నీలమ్మ తలపై గాయంతోనే మృతిచెందిందని, మిగతా ఎక్కడా గాయాలు లేవని వైద్యులు గుర్తించారు. దీంతో పోలీసులు ఈ కోణంలో పరిశోధన చేపట్టారు. గతనెలల 28న నీలమ్మ మమత ఆస్పత్రికి వెళ్లే రహదారిలో చైతన్యనగర్ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా ఎల్లంకి వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. దీంతో ఆమె తలకు గాయమైంది. ఈమేరకు ఆమెను ఆటోడ్రైవర్ కోటమర్తి వెంకటేశ్వర్లు మానవతా దృక్పథంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అనంతరం ఆమె చికిత్స పొందుతూ అదే రోజు మధ్యాహ్నం మృతిచెందింది. ఈమేరకు సీసీ ఫుటేజీల ఆధారంగా బైక్ నడిపిన వ్యక్తి, ఆటో డ్రైవర్‌ను గుర్తించామని సీపీ తెలిపారు.

కానీ వాస్తవం తెలియకపోవడంతో మృతురాలి బంధువులు కిడ్నాప్, హత్యగా ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దీంతో కేసును చాలెంజింగ్‌గా తీసుకుని అన్ని కోణాల్లో అన్వేషించామన్నారు. కాగా, నీలమ్మ, మల్లమ్మ ఏప్రిల్ 27న వచ్చామని చెబుతున్నా 28న ప్రమాదం జరిగిందని.. దీంతో వారు ఎప్పుడొచ్చారనే అంశంపై వివరాలు ఆరా తీస్తున్నామని సీపీ తెలిపారు. కాగా, కేసు దర్యాప్తు చురుగ్గా వ్యవహరించిన అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు గణేష్, ఏసీపీ రవికుమార్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్‌తో పాటు క్షతగాత్రురాలిని మానవతా దృక్పథంతో ఆస్పత్రిలో చేర్పించిన ఆటోడ్రైవర్‌ను సైతం పోలీసు కమిషనర్ వారియర్ అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన కమాండెంట్



కలెక్టర్ గౌతమ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమాండెంట్ జమీల్‌పాషా

ఖమ్మం సహకారనగర్: సత్తుపల్లి మండలం గంగారంలోని ప్రత్యేక పోలీసు బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ పాషా కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను కలిశారు. ఖమ్మంలోని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్‌ను కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి పలు అంశాలపై చర్చించారు.

పనులు త్వరగా పూర్తిచేయండి

జిల్లాలో జాతీయ రహదారుల పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఇటీవల నేషనల్ హైవే పీడీగా బాధ్యతలు స్వీకరించిన జి.దుర్గాప్రసాద్‌ను కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారుల పనులు, భూసేకరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, జాతీయ రహదారుల ఖమ్మం మేనేజర్ దివ్య పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సాయిస్ఫూర్తి కళాశాల యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సాయిస్ఫూర్తితో పాటు ఇతర కళాశాలల విద్యార్థులకు టాస్క్ సహకారంతో ఆన్ స్కూల్ కంపెనీ ఆధ్వర్యాన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా బీటెక్, డిగ్రీ, ఎంబీఏ, పీజీ చదువుతున్న176 మంది హాజరయ్యారు. అనంతరం బిజినెస్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లుగా 15 మందిని రూ.6.50లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్, ఎంపీ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విసాపన ఎడ్యుషనల్ ట్రస్టీ బండి అన్విద, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి, డైరెక్టర్ డాక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్‌తో పాటు డాక్టర్ డీఎస్‌వీ.కృష్ణారెడ్డి, బి.సంతోష్‌కుమార్ తదితరులు అభినందించారు.